# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నీతి ఆయోగ్ ప్రతినిధులతో ఈ రోజు సమావేశమయ్యారు.**

2. **వచ్చే నెల 13 వ తేదిన మరో 75 అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు.**

3. **ప్రజల అవసరాలకు అనుగుణంగా త్రాగునీరును అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

4. **రాష్ట్రంలోని 62 నిల్వ కేంద్రాల్లో ప్రస్తుతం 16 లక్షల 63 వేల 263 టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్లు గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా పేర్కొన్నారు.**

5. **ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించడంతో పాటు, ఫిర్యాదులను సమర్ధవంతంగా పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది.**

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నీతి ఆయోగ్ ప్రతినిధులతో ఈ రోజు సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో విజన్ 2047 డాక్యుమెంట్ రూపకల్పనపై నీతి ఆయోగ్ ప్రతినిధులతో వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ దార్శనిక పత్రాలపై ముఖ్యమంత్రి చర్చించనున్నారు. మరోవైపు.. దేవదాయ శాఖపై కూడా ముఖ్యమంత్రి ఈ రోజు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

--------------------------

రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. విశాఖపట్నంలోని కాపులుప్పాడ డంపింగ్ యార్డులో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని శాసనసభ్యులు శ్రీనివాసరావుతో కలిసి మంత్రి ఈ రోజు పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఇతర దేశాల్లో అమలవుతున్న ఘన వ్యర్థాల నిర్వహణ విధానంపై అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేయనున్నామని తెలిపారు. వచ్చే నెల 13 వ తేదిన మరో 75 అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తామని చెప్పారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలను చేపట్టిన నిర్మాణాలపై చర్యలు చేపడతామని నారాయణ తెలిపారు.

--------------------------

ప్రజల అవసరాలకు అనుగుణంగా త్రాగునీరును అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో సురక్షిత నీటి కేంద్రాన్ని పురపాలక సంఘం అధికారులతో కలిసి మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సురక్షితమైన త్రాగునీరు అందించేందుకు తాగునీటి సరఫరా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. పాలకొల్లులో మంచినీటి సమస్యను తీర్చేందుకు జనాభాకు అనుగుణంగా 15 కోట్లరూపాయలతో కొళాయిలు, నీటి నిల్వ ట్యాంకులు నిర్మించామని తెలిపారు. త్రాగునీరు సరఫరా పై వచ్చిన ఫిర్యాదులను, క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని 62 నిల్వ కేంద్రాల్లో ప్రస్తుతం 16 లక్షల 63 వేల 263 టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్లు గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా తెలిపారు. జులై 8 నుంచి నిన్నటి వరకూ 21 లక్షల 47 వేల 883 మెట్రిక్ టన్నుల ఇసుక కొనుగోలుదారులకు చేరిందని, ముఖ్యమంత్రి సూచనల మేరకు బుకింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న ఇసుక వివరాలను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నాయని పేర్కొన్నారు. నిన్న 22 వేల 114 టన్నుల ఇసుక కోసం 1,748 బుకింగ్‌లు జరిగాయని, వాటిల్లో 20 వేల 552 టన్నులు సరఫరా చేశామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని అన్నా కాంటీన్లలో పరిశుభ్రత పాటిస్తున్నామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. తణుకు అన్న క్యాంటీన్‌లో అపరిశుభ్రత అంశంపై మంత్రి స్పందించారు. రుచి, శుచి, శుభ్రతకు అన్నా క్యాంటీన్లో అత్యంత ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వీడియో వాస్తవం కాదని స్పష్టం చేశారు. కావాలనే కొందరు అన్నా కాంటీన్ల పై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని నారా లోకేశ్ పేర్కొన్నారు. మరోవైపు తణుకు అన్న క్యాంటీన్‌లో శుభ్రత పాటించడం లేదన్న ప్రచారంపై రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ ఆరా తీశారు. హరేకృష్ణ మూమెంట్ ప్రతినిధులు, అధికారులు నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్లేట్లను మురికినీటిలో కడుగుతున్నారనేది పూర్తిగా అవాస్తవమని అధికారులు మంత్రికి తెలిపారు.

---------------------------

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. వచ్చే నెల 7వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలపై అన్ని శాఖల అధికారులతో కాణిపాకం దేవస్థానంలో ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 21 రోజులపాటు కాణిపాక వరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని సామాన్య భక్తులకు త్వరితగతిన దర్శనం లభించేలాచర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు.

---------------------------

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టి గణపతులను ఏర్పాటు చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని వినాయక నిమజ్జన కమిటీ సభ్యులతో కలెక్టర్ ఈరోజు సమావేశమైయ్యారు. అనంతరం కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ, పండగలలో సంప్రదాయాల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను కూడా ప్రజలు తీసుకోవాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించే

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ లాంటి విగ్రహాలకు ప్రత్యామ్నాయం మట్టి వినాయకులను ప్రజలు పూజించాలని, ఈ అంశంపై వినాయక నిమర్జన కమిటీ సభ్యులు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.

---------------------------

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించడంతో పాటు, ఫిర్యాదులను సమర్ధవంతంగా పరిష్కరించేందుకు కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలని విడుదల చేసింది. పౌరులకు సాధికారత కల్పించే ప్రక్రియను క్రమబద్ధీకరించడం, మరింత స్పష్టత తీసుకురావడం, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించడం, ఫిర్యాదులను సమర్ధవంతంగా పరిష్కరించేందుకు ఈ మార్గదర్శకాలు విడుదల చేసినట్లు తెలిపింది. పౌరులు తమ ఫిర్యాదులను www.pgportal.gov లో నమోదు చేసుకోవచ్చని, ఇది ఏకగవాక్ష విధానంలో పనిచేస్తుందని వెల్లడించింది. కేంద్ర మంత్రిత్వ శాఖలు విభాగాలు ప్రజా ఫిర్యాదుల కోసం నోడల్ అధికారులను నియమించి ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తారని తెలిపింది.

---------------------------

కృష్ణా జిల్లా గుడివాడలో రేపు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి విక్టరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ ఉద్యోగ మేళాను యువత సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. వరుణ్ మోటార్స్ సంస్థలో సర్వీస్ అడ్వైజర్లు, టెక్నీషియన్లు, డెన్టర్స్ – పెయింటింగ్స్, అకౌంటెంట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. పదో తరగతి, ఐటీఐ డిప్లొమా, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 30 ఏళ్లలోపు వారు ధృవపత్రాలతో నేరుగా గుడివాడలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న అన్నా క్యాంటీన్ కు వ్యాపారవేత్త, సెల్ కాన్ సీఎండీ వై. గురుస్వామి నాయుడు 26.25 లక్షల రూపాయలను విరాళంగా అందించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని నిన్న హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి చెక్కును అందజేశారు. పేదలకు 5రూపాయలకే అన్నం పెట్టాలనే ఉద్దేశంతో ప్రారంభించిన అన్నక్యాంటీన్ల నిర్వహణలో భాగస్వాములయ్యేందుకు వివిధ వర్గాల ప్రజలు, వ్యాపారులు ముందుకు రావడం అభినందనీయమని, పేద ప్రజలకు నాణ్యమైన భోజనాన్ని అందించే ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేందుకు ఎవరైనా విరాళం అందించవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారిణి జి లక్ష్మి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 18 సెకన్లు...

---------------------------

ఇంజినీరింగ్ కళాశాలల్లో మూడో విడత ప్రవేశాల కౌన్సెలింగ్‌లో నిన్న ప్రవేశాల కేటాయింపు పూర్తి చేసినట్లు సాంకేతిక విద్యాశాఖ సంచాలకులు, ప్రవేశాల కన్వీనర్ జి.గణేష్‌కుమార్ తెలిపారు. మొత్తంగా 248 కళాశాలల్లో 1లక్ష 39వేల 488 ప్రవేశాలకు గానూ.. అందులో 1లక్ష 16వేల 333 భర్తీ చేసినట్లు వెల్లడించారు. కన్వీనర్ కోటా కింద 24 విశ్వవిద్యాలయాల ఇంజినీరింగ్ కళాశాలల్లో 7వేల 047 ప్రవేశాలు ఉండగా.. వాటిలో

5వేల 920 భర్తీ అయినట్లు తెలిపారు.

---------------------------

సేవకు ప్రతిరూపంగా మథర్ థెరిసా నిలిచారని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులోని సమిశ్రగూడెం గ్రామంలో మథర్ థెరిసా విగ్రహా జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొని మథర్ థెరిసా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మదర్ థెరిసా చేసిన సేవా కార్యక్రమాలు అందరికి మార్గదర్శకం అని తెలిపారు. మథర్ థెరిసా ఆశయాలను పాటిస్తూ ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలని మంత్రి పేర్కొన్నారు.

=======================